# ‘ఇ–ప్రగతి’ పోర్టల్ సిద్ధం

## ఈనెల 12న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 10 : ప్రభుత్వ సేవలకు, సమస్త సమాచారానికి వేదికైన ‘ఇ–ప్రగతి’ పోర్టల్‌ను ఈనెల 12న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ‘వన్ గవర్నమెంట్ – వన్ పోర్టల్’ విధానంతో డిజిటల్ ఏపీకి ఇది బాటలు వేసేలా వుండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగులు, పౌరులు, వ్యాపారుల, విద్యార్థులు ఇలా అందరికీ ఇది ఉపయోగకరంగా వుండాలన్నారు. ‘ఇ–ప్రగతి’పై మంగళవారం ఉండవల్లిలోని తన నివాసం దగ్గర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

‘ఇ–ప్రగతి’ పోర్టల్ ద్వారా పంచాయతీరాజ్, రహదారులు–భవనాల శాఖల్లో 8 వేల మంది ఉద్యోగులకు ఎం–బుక్, ఆర్థిక సేవలు, పాఠశాల–ఇంటర్మీడియేట్ విద్యను అభ్యసిస్తున్న 10 లక్షల మంది విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి సేవలు, వ్యవసాయ మార్కెటింగ్‌లో 25 వేల మంది వ్యాపారులకు లైసెన్సులు అందించేలా ఏర్పాటు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వివరించారు. రవాణా శాఖలో ప్రస్తుతం అందిస్తున్న 14 సేవలను ఇందులో అనుసంధానిస్తున్నట్టు తెలిపారు.

ఆన్‌లైన్‌లో వివాహ నమోదు పత్రాలు, భూసార పరీక్ష కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు ఇలా కాగితం లేని పాలనా వ్యవస్థను ఈనెల 27న ప్రారంభించాలని భావిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ జూన్ నాటికి అన్ని శాఖల్లోనూ ఆడిటింగ్ పూర్తవుతుందని, నాటి నుంచి వివిధ శాఖల్లో దశలవారీగా ‘ఇ–ప్రగతి’ అమలు గురించి వెల్లడిస్తామని చెప్పారు. ‘ఇ–పథకం’ పేరుతో పథకాల ట్రాకింగ్ చేయదలిచినట్టు పేర్కొన్నారు.

విద్యాశాఖలో సంపూర్ణంగా ‘ఇ–ప్రగతి’ని ప్రవేశ పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యాసంస్థల నమోదు, కొత్త విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు, విద్యార్థులకు సంబంధించి అన్ని సర్టిఫికెట్ల జారీ, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహాలు వంటి అంశాలను ఇ–ప్రగతిలోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. విద్యా వ్యవస్థకు ప్రత్యేకంగా

**రోడ్ మ్యాప్ రూపొందించామని ఆగస్ట్ 31 నాటికి అన్ని పూర్తి చేస్తామని ఇందులో ఇ–హాజర్, ఇ–అడ్మిషన్ వంటివి వున్నాయని చెప్పారు.**

**సమీక్షలో ఐటీ సలహాదారు జె సత్యనారాయణ, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి సాయిప్రసాద్, ఐటీ శాఖ కార్యదర్శి కె విజయానంద్, ఆర్టీజీ సీఈవో అహ్మద్ బాబు, ఇ–ప్రగతి సీఈవో ఎన్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.**